# బ్రతుక నేర్పిన సీత

పోర్లె అప్పారావు




ఈ మూలనుంచి చూస్తే ఇక్కడి నుండి ఈ విశాలమైన రోడ్డుపొడుగునారోడ్డని అనుకుని ఆ కనుచూపు మేర వరకు చాలా ఎత్తునుండి ఏటవాలుగా ఉన్న ఈ స్థలం రకరకాల మొక్కలు, అందమైన ఫెన్సింగుతో అలంకరించబడి ఉంటుంది ఆచంట గార్డెన్.

అదిగో! ఆ కనిపిస్తున్న ఆ మూల ఆ పచ్చని పచ్చని పచ్చిక మీద రెండు పక్షులు.

చిలక — గోరింక.

సీత — కృష్ణ.

ఎత్తుగా ఉన్న ఈ చోటుకి వస్తున్న చల్లని మలి సంధ్యా గాలి ఈ ఇద్దరి మనుసుల్ని నిర్మలం చేస్తున్నది. దిగువున నీటుగా ఉన్న ఆ రోడ్డుపై రయ్ రయ్ మని వాహనాలు పరిగెడుతున్నాయి. ఇలా ఈ ఆడ ప్రక్క ఈ మగ కూర్చుంటే చాలామందికి కావలసింది ఇద్దరి మధ్యా ఏదో ఉందని. వాహనాల్లో పోతున్న, కాళ్ళతో నడుస్తున్న కొన్ని శరీరాలకళ్ళుదేబె ముఖాల్లో ఇటే చూస్తూ తమ దారిన తాము పోతున్నాయి.

కృష్ణ సీతవైపు చూశాడు.

ఆమె తల పైకెత్తుతూ అతనివైపు చురుకుగా చూసింది. ఎదురుగా కనిపిస్తున్న దానికంటె స్మృతి లోతే తీయన!

ఆ చూపుని చూస్తుంటే తనకి మొన్న రథ యాత్రలో ఆమె చూసిన చూపు గుర్తు కొచ్చింది.

అప్పుడు ఇలాంటి చూపే చూసి తప్పించుకు పోయింది ఈ సీత.

అప్పుడు మసక మసక చీకటి. పెద్ద ఎత్తున కొండలా నిలబడ్డ జగన్నాథుని రథంలో క్రిక్కిరిసి ఉన్నారు జనం. ఇంకా ఒక వైపు మెట్ల మీద నుంచి జనం తండోపతండాలుగా పైకి ఎగ్రబాకుతూనే ఉన్నారు. రెండోవైపు మెట్లపై నుండి కిందకి జల ప్రవాహంలా జలజలా దిగిపోతున్నారు. నిజమో అబద్ధమో గాని తను చాలాసార్లు విన్నాడు— పూరీలో ఉన్న రథం తర్వాత దేశం మొత్తం మీద పేర్కొనదగిన రథం ఈ విజయనగరాన మాత్రమే ఉందని. ఉక్కిరి బిక్కిరవుతున్న ఆ రద్దీలో నుండి గభీమని తనని బయటికి తోసేశారు ఎవరో. ఆ తొందరలో రథం మీద నుంచి చూపుని మళ్ళించి మెరుపులా రోడ్డుకి ప్రక్కగా చేరుకున్నాడు తను. అక్కడా జనమే. అంతగా లేరు. ఎవరో అలా తోసేయడమే మెరుగయింది.

ఎదురుగా ఈ సీత!

ఆ క్రీనీడలో తను నిలిపిన చూపులని తప్పించుకో లేక ఒక క్షణం కళ్ళు కలిపింది. ప్రక్కనున్న ఒక ప్రౌఢ ఈమె చేతిని పుచ్చుకొని నడవడంతో ఆమె వెంట చకచకా జనాన్ని తప్పించుకొని తోవ తీసింది. తను వెంట పడ్డాడు.

వాళ్ళు చిన్న మలుపు తిరిగారు. తనూ తిరిగాడు. వెంటనే గబగబా నాలుగయిదు సందులు తిరిగి మాయమయారు.

ఇక అక్కడ తను ఒక్కడే మిగిలాడు.

ఏమిటా వింత అంటే అది అంతే!

ఈ విషయంలో ఈ సీతదే పై చేయి.

ఆ ఒక్క క్షణం చూసిన ఈమె చూపుని కొద్ది రోజుల వరకు మరిచిపోలేక పోయాడు. అచ్చు అదే చూపు.

అప్పుడే కాదు—ఆ తరవాత చాలా సార్లు ప్రయత్నించాడు ఈమె పరిచయ భాగ్యం కోసం. తన అడ్రను తెలియనివ్వకుండా చాలా జాగ్రత్త పడింది. [illegible] పట్టు విడవకుండా మరో సారి ఈమె కనిపించినప్పుడు ఈమెకి తెలియకుండా ఈమె ఇల్లు తెలుసుకోవాలని వెంబడించాడు. కాని ఫలితం లేకపోయింది. వాళ్ళ మధ్యంలో ఎవరో స్నేహితురాలు బయటే నుండి [illegible]

పిలిస్తే లోపలికి వెళ్ళి చాలాసేపటివరకుబయటికి రాలేదు. కాలేజీకి టైమయిపోయి అప్పటికి ఆ ప్రయత్నం మానుకున్నాడు తను.

కొన్ని కంపెనీల ఏజెన్సీలు తీసుకొని ఇక్కడ కొత్తగా ఒక సంస్థని ఏర్పాటు చేశారు కృష్ణ తండ్రి. కుటుంబమంతా కొద్ది రోజుల క్రితమే ఇక్కడికి వచ్చేసింది. మిగిలినది ఒక్క సంవత్సర మయినా ఈ ఒక్కడిని ఆ పాత వూర్లో ఉంచి చదివించడం అతనికి ఇష్టం లేదు, అంత బుద్ధిమంతుడని. రెండేళ్ళు గడపగా మిగిలిపోయిన ఒక సంవత్సరం డిగ్రీలో స్థానిక పెద్దమనిషి రికమెండేషన్‌తో ఇక్కడి కాలేజీలో ఖాళీ లేకపోయినా బలవంతంగా ఇరికించారు.

ఈ కృష్ణకి తోటి విద్యార్థులతో తిరగడం అంతగా ఇష్టం లేదు. అయినా అంతా కొత్తవాళ్ళు. పైగా తనకు కావలసింది చిలక. చిలక అంటే మహా సరదా. తనకు నచ్చినది కనిపిస్తే వెంటబడి సహచర్యం పొందాలన్న ఆరాటం ఎక్కువ. కాని ఇప్పటి వరకు. ఎవరూ సన్నిహితం కాలేదు. ఎందుకంటే అలాంటి చిలక తారసపడలేదు.


ఈ వూరు కొత్త గనక ఇంటికి—కాలేజికి తప్ప వూర్లోని మిగతా దారులన్నీ తెలియవు కృష్ణకి. లార్డ్ వెన్ లాక్ పబ్లిక్ లైబ్రరీ కమ్ గాంధి పార్కులో తొలిసారిగా ఈ సీతని పరిచయం చేసుకున్నాడు. అనుకూల మనిపించింది. ఆ తరవాత ఆడ ప్రక్క మగ సహచర్యం చేయాలనే సహజ కోరిక వల్ల అప్పుడప్పుడు ఈమెతో కలసి కొన్ని దారులు తెలుసుకొన్నాడు. కాని ఇంతవరకు ఈమె అడ్రసు తెలుసుకోలేక పోయాడు. ఈమె ఆ అవకాశ మివ్వ లేదు. కాని, కనిపించని దైవ అనుగ్రహం వల్ల ఇప్పుడు ఎదురుగా ఈ అదృష్టం ఉంది. ఎలాగో వోలా నానా యాతనపడి ఈమెచే మంచివాడు అని పించుకున్నాడు.

రెండు రోజుల క్రితం తన గురించి పూర్తి వివరాల్ని నెహ్రూ పార్కులో విప్పి చెప్పాడు. ఈ వేళ ఇక్కడ కలుద్దా మనుకున్న నిర్ణయం ప్రకారం ఇప్పుడు కలసి కూర్చున్నాడు.

ఆడది ఇంత ఫ్రీగా ఇలా మగాడితో కలిసిపోవడం ఎన్నో అనర్థాలకు దారి తీస్తుందని ఈమెకి తెలుసు. సంఘంలో అందరితోనూ కలుపుగోలుగా ఉండాలని ఈమె దృష్టి తప్ప విచ్చలవిడిగా మగాళ్ళతో కాలక్షేపం చేయాలని కాదు. తనని తాను రక్షించుకో గలననే దృఢ నమ్మక మున్నది. ఈమె తండ్రికి కూడా ఈమె చెడిపోతుందనే అపనమ్మకం లేదు. తనంతట తాను పరిచయం చేసుకోవడానికి ఇతను పడిన ముప్పుతిప్పలని, ప్రవర్తనని ఇప్పటి వరకు ఈమె గమనించుకు వచ్చింది. సహజంగా వయసులో ఉన్న ఆడది చేస్తున్నట్లే ఇప్పుడు ఈమె ఇతడ్ని ఆకర్షించింది.

అనుకున్న ప్రకారం తన గురించి చెప్పడం ప్రారంభించింది. మాటలు చిలక పలుకుతున్నట్లు న్నాయి. ఇది వరలో అనుకున్న ఇదే భావం మళ్ళీ అనిపించగా ఆమె కళ్ళని సునిశితంగా గమనిస్తూ దృష్టి మరల్చకుండా విన సాగాడు కృష్ణ.

"నాకు టెన్త్ చదువు, టైపు పూర్తయాయి. మా నాన్నగారిది పనిచేయలేని స్థితి. ఎక్కువదూరం నడవలేరు. పగలు కూడా పక్కమీదే గడుపుతుం టారు.



రవీంద్ర భారతిలో జరిగిన "వసంతోదయం" కావ్యావిష్కరణ ఫొటో

అందుకే తండ్రి అండ నా కుందని నిర్భయంగా ఉండలేక పోతున్నాను. కొన్ని కొన్ని సమయాల్లో ఆయన ఉండి కూడా లేనట్లే అనిపిస్తున్నది. నా కున్న ఒక్కగా నొక్క అన్నయ్యా పెళ్ళాం పిల్లల్తో వేరే కాపుర మున్నాడు. ప్రైవేటు ఉద్యోగి. వాడు తెచ్చుకునేది వాళ్ళకే చాలదు. మాకు సర్దడం అన్నది చాలా అరుదు. నాకా ఉద్యోగం దొరకడం లేదు. నాన్నకి వస్తున్న పించను డబ్బుల్ని కరగేస్తున్నాను. చిన్నప్పటి నుండి ఇంటి పెత్తనం నా మీదే వదిలారు నాన్న. అందువల్ల కొన్ని విషయాల్లో ఆరిందని. తల్లికి పిల్లా, పిల్లకి తల్లీ తోడు అంటారు. నా చిన్న తనం లోనే పోయింది అమ్మ. ఆమె లోటు నాకు ప్రతి క్షణం ఎదురవు తున్నది. ఆమెని తలచు కుంటే నా గుండె బరువవు తున్నది. ఇక ఎక్కువగా చెప్పలేను ..." కళ్ళలో నీళ్ళు తిరగసాగాయి.


వూరకుండ చేస్తూ ఆమె మోకాలి మీద రారిం చాడు కృష్ణ.

అతని చేతిని తొలగిస్తూ "ఈ నా పరిస్థితి చెప్పి మీచే ఆకర్షింపబడాలని నాకు లేదు. ఏదో పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటున్నాం గనుక కాలక్షేపానికి నా పరిస్థితి చెప్పాను. అంతే" అంది స్వాభిమానం అడ్డువచ్చి.

తరవాత చురుకుగా కళ్ళు తుడుచుకుంటూ కొంతసేపు ఆగి —

"ఇక మీ గురించి అం టారా — నేను కాదం టున్నా నన్ను వెంబడిస్తున్నారు. నాకు తెలుసు. ఇన్నాళ్ళూ మిమ్మల్ని పరీక్షించాను. మొట్ట మొదటి సారిగా మనం కలసిన ఆ హరికథా పితామహుని విగ్రహం వద్ద మిమ్మల్ని మాటల్లో స్పష్టంగా గమనించాను. మీరు నాకు అమాయకంగా కనిపిం చారు. నీటుగా ఉంటారు. మీ నడవడి నాకు నచ్చింది." ఈ ఆఖరిమాటల్ని నేల చూపులుచూస్తూ సిగ్గుగా అని, తటాలున తల పైకెత్తి కృష్ణ కళ్ళని గమనించింది.

తన గురించి ఇలా చెప్పడంతో లోలోన పొంగి పోయి కళ్ళలో మగ కోరిక కదలాడు తున్నది.



సీత గమనించడం చూసి తన్ను తాను చటుక్కున సంబాళించుకొని అంతకుముందు విన్న ఆమె గాథ స్మరణకి రాగా బాధపడుతూ అన్నాడు.

"మా నాన్న గారు కొత్తగా ఇక్కడ ఒక సంస్థని తెరిచారు. అందులో మీకు తప్పకుండా క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్ట్ ఇప్పిస్తాను. నా మాట కాదనరు నాన్న. ఏదో మీరు ఆడవారని నేను ఎర చూపుతున్నానని భావించకండి నన్ను తప్పుగా అర్థం చేసుకోవద్దు. త్వరలో ఈ శుభవార్త మీకు తెలుపుతాను. మీ అడ్రసు చెప్పండి." సినిమా హీరోలా డైలాగులు అప్పచెప్పేశాడు.

కృష్ణ చూపుతున్న ఈ ఆశకి సీత ఏమాత్రం చలించలేదు.

"మీరు సహాయం చేస్తాననడం నిజంగా అదృష్టమే. అడ్రసులో ఏమేముంది. మళ్ళీ ఈ మధ్యలో మనం కలవక పోము. లేకుంటే నేను మీ కాలేజీకి వచ్చి ఎంక్వైరీ చేస్తాను మిమ్మల్ని. సరేనా?!

మా ఇల్లు మీకు తెలియనివ్వక పోవడంలో మరే ఉద్దేశమూ లేదు. కొన్ని రోజుల వరకు నా అడ్రసు తెలియనివ్వక పోవడమే నా చుట్టూరా సంఘంలో నాకు మేలు. అవసరం వచ్చినప్పుడు తప్పకుండా మీకు తెలుపుతాను." నవ్వుతెప్పే ధోరణిలో అంది సీత.

కృష్ణ మరేమీ అనలేదు. మౌనమే మంచిదని ఊరుకుని, పైకిలేచి, తన ఖరీదయిన టక్ అప్‌ని సర్దుకున్నాడు. సీత తన కుచ్చిళ్ళు సర్దుకుంటూ లేచింది. తరవాత ఇద్దరూ బుర్రలు దించుకుని సినిమాలు, అవీ ఇవీ మాట్లాడుతూ ఒకరి నొకరు అనుసరిస్తూ అడుగులు వేసుకొంటూ యాంత్రికంగా కిందికి దిగి గంటస్తంభం వైపు నడక సాగించారు.

ఐదు దాటి పోయింది.

పెద్ద చెరువులో పడమటి ఎరుపు మిలమిలమని మెరుస్తున్నది.

మలుపు తిరిగాం.

పోస్టాఫీసు.

మరేమీ మాట్లాడడానికి లేక—"ఈ పోస్టాఫీసు చాలా బాగా కట్టారండి" అనేశాడు కృష్ణ పోస్టాఫీసుని చూస్తూ.

"అవును."

"దీన్ని చూసినప్పుడల్లా మొత్తం బిల్డింగుని పూర్తిగా చూడాలని చాలాసార్లు అనుకున్నాను. అవలేదు. ఇప్పుడు చూద్దామా? మీరు ఇదివరకే చూసేశారా?" గబగబా అడిగేశాడు ఆమె ముఖం ప్రసన్నంగా ఉందని.

"పదండి. నాది ఈ ఊరన్న మాటేగాని ఇది కట్టి సంవత్సర మయినా నేను ఇంతవరకు చూడనే లేదు."

ఇద్దరూ నడవసాగారు. తను కోరినట్లు చేస్తున్నది. కృష్ణకి మహా ఆనందంగా ఉంది. కాలు నేల మీద ఆనటం లేదు. గాలిలో తేలడమే.

పోస్టలు, టెలిగ్రాపు, టెలిఫోన్ ఆటో ఎక్స్ఛేంజి మొత్తం అన్ని ఆఫీసులకి కలిపి చాలా పెద్ద బిల్డింగు ఇది. భవిష్యత్తులో ఈ వూరు 'జిల్లా' కేంద్ర మయినా అంతకు మించిన అవసరాలను తీర్చగలిగే బిల్డింగు. ఒక రకంగా ఈ వూరులో చూడదగిన అందమైన కొద్ది స్థలాల్లో ఇదొకటి.

ఈ మాటలే అనుకొని ఎక్స్ఛేంజిని సమీపించారు.

బిల్డింగు దిగువున నేల మీద చిలకా గోరింక పక్షులు వాలిన ట్లున్నారు వీళ్ళు. ఇంచుమించు ఆకాశాన్నంటినట్లుంది ఆ ఎత్తైన భవనం.

"ఎవరు కావాలండి?" గేట్ మన్ ప్రశ్న.

నిజానికి ఇద్దరికీ అందులో తెలిసిన వారు ఎవరూ లేరు. చూడడానికి వెళ్తా మంటే వాడు పంపడు. పోజు కొడతాడు. పర్మిషన్ తీసుకోవడానికి కొంత టైమ్ పడుతుంది.

సీత ముఖం చూశాడు కృష్ణ. ఆమెలో 'చిన్న నిరాశతో కూడిన చిరాకు!'

"అప్పలనాయుడు గారు కావాలి." టకీమని అన్నాడు కృష్ణ.

"ఫ్లోర్ నెంబర్ రెండో మూడో. లిఫ్టు ఎక్కండి." బటన్ నొక్కి లిఫ్టు తలుపు తెరిచాడు వినయంగా.

"ఫరవాలేదు. మెట్ల మీద నుంచే వెళ్తాం" అంది సీత. మొత్తం బిల్డింగు అంతా చూడాలనుంది సీతకి. కృష్ణ అడ్డు చెప్పలేదు.

ఇద్దరూ నెమ్మదిగా మెట్లు ఎక్కసాగారు.

ప్రతి ఫ్లోర్ లోనూ విశాలమయిన గదులు గాజు తలుపులు లోంచి కనిపి స్తున్నాయి. ప్రతి గదిలోనూ ఆటో మెషినరీ. మొత్తం పరిసరాలన్నీ నీట్‌గా ఉన్నాయి. ఎక్కడ చూసినా ఒక రిద్దరు తప్ప అసలు మనుషులే కనబడ్డం లేదు.

"ఎవరాయన?" అడిగింది సీత.

"ఎవరు?"

"అదే. అప్పల నాయుడు అన్నారు."

"ఓహో అదా! ఈ విశాఖ జిల్లాలో సింహాచలం దేవుణ్ణి దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంతం వాళ్ళు పేర్లు పెట్టడంలో చాలా ప్రయోగాలు చేసేవారు. చెప్తే ఇదో పెద్ద గ్రంథం! ఇంచు మించు చాలా మంది పేర్ల ముందు అప్ప అనో, అప్పల అనో తప్పకుండా ఉంటుంది. తరవాత రాజో, స్వామో, నాయుడో, రావో మన ఇష్ట మొచ్చింది చేర్చుకోవడమే మన పని. ఆయ నెవరో నాకు తెలీదు. అప్పటికీ నాయుడు చేర్చడం మనకు పనికొచ్చింది. ఇంకే దయినా అన్నా నంటే అలాటి వారు ఎవరూ లేకపోతే పొమ్మంటా డేమోనని అలా అన్నాను.

సీత నవ్వు ఆపుకోలేక పక పక మంది. కృష్ణ శ్రుతి కలిపాడు. ఆ హాలు లోని ఒక రిద్దరి తలలు ఇటు అటు తిరిగేయి.

"అమ్మో నేను మరి నడవలేనండి. లిఫ్టు ఎక్కి పై అంతస్థు చేరుకుందాం" అంది.


"ఏం? అన్ని ఫ్లోర్సూ చూడరా?"

"ఊహూ. పై నుంచి మొత్తం వూరంతా చూడాలనుంది."

ఆఖరి ఫ్లోర్‌లో లిఫ్టు తలుపులు తెరచుకుని బయటికి వచ్చి ఆ బిల్డింగ్ ఓపెన్ టాప్ పోర్షన్ చేరుకున్నారు.

"అబ్బ! ఎంత బావుంది మా పట్నణం లాండ్ స్కేప్" అంటూ చుట్టూ చూస్తూ ఆహ్లాదం పొందింది సీత. ఆమె ఇలా తన సొంత వూరుపైన మక్కువ చూపడం, ఆ పరిసరాలు — అనవసరి మనిపించాయి కృష్ణకి. ఆమె పడుతున్న ఆనందాన్ని చూసి తనివి చెందుతున్నాడు.

కృష్ణలో వచ్చిన ఈ స్వల్ప మార్పుని తను గమనించీ గమనించనట్లు తన సహజ ధోరణిలో ఆటు






ఉమేష్ యోగదర్శన్ (2వ భాగము)
రచయిత : యోగిరాజ్ శ్రీ ఉమేష్ చంద్రజీ
ఇంగ్లీషు మరియు హిందీ ప్రతులు వెల: రు. 30/— (పోస్టేజి రు. 4/— అదనము)
ఇది యోగమును గురించిన ఒక ఉత్తమ గ్రంథము. 'ప్రాణాయామం' (శ్వాసనిరోధము) మనోనిగ్రహం, ఏకాగ్రత, మననం మరియు 'సమాధి' అధివ్యక్తస్థితి యొక్క వివిధ స్థాయిల వంటి విషయములను గురించి తేటతెల్లమైన భోదట్టాను స్పష్టమైన బొమ్మలతో ఇస్తున్నది, రచయిత యొక్క స్వానుభవం ఆధారంగా వ్రాయబడిన ఈ పుస్తకం వివరు కాని తమ లోని "కుండలినీశక్తి" ని విట్లు మేల్కొల్ప గలుగునదీ తెల్పుచున్నది. వ్రాయండి సేదా విచ్చేయండి
శ్రీ రామ తీర్థ యోగాశ్రం,
దాదర్, సెంట్రల్ రైల్వే స్టేషను సమీపమున, బొంబాయి 400014,

అనన్య సామాన్య ప్రచారం గల తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక

మంచి అవకాశం! త్వరపడండి!
బాలల మనస్తత్వం, అవసరాలు ఎరిగి ఉన్న మేధావులు వినోదం, విజ్ఞానం సమ్మేళించి రచించిన ఉత్తమ బాల సాహిత్యం. విఖ్యాత తెలుగు రచయితల అనువాదాలు.
ఒక్కొక్క పుస్తకం వెల రూపాయన్నర మాత్రమే.
పిల్లిజాతి : పిల్లి వంశంలోని జంతువుల రమ్యమైన వర్ణన. తిరుమల రామచంద్ర అనువాదం.
మన రైల్వేల కథ : రైల్వేల పుట్టుపూర్వోత్తరాలు, అవసరాలు, ఆధిక్యత వివరించే రచన. పురాణం సుబ్రహ్మణ్య శర్మ అనువాదం.
పక్షుల లోకం : పక్షుల వర్ణనలతో రమ్యంగా రచించబడినది. సైదుల్ రెడ్డి అనువాదం.
విదేశీయుల భారత దర్శనం : చరిత్ర, భూగోళం, విషయ పరిజ్ఞానంతో నిండిన రచన. బాలాంత్రపు రజనీకాంత రావు అనువాదం.
కాశ్మీరు : అందానికీ, వినోదానికీ ప్రఖ్యాతిగాంచిన కాశ్మీరు కథ. వి. రాధాకృష్ణ అనువాదం.
రంగు రంగుల బొమ్మలతో, ఆకర్షణీయమైన ముఖ చిత్రంతో మీ పిల్లలు విడవకుండా చదివే 64 పేజీల పుస్తకం. ఈ క్రింది చోట్ల దొరుకుతాయి.

ఎస్. బి. టి.
బుక్ సెంటర్
సిటీ సెంట్రల్ లైబ్రరీ
అశోక్‌నగర్
హైదరాబాదు—500 020
ఎ. పి. బి. డి.
ద్రాక్షపతి రోడ్డు
హైదరాబాదు
ఎమ్. శేషాచలం అండ్ కో.
మద్రాసు, మచిలీపట్నం

విశాలాంధ్ర ప్రచురణలు
హైదరాబాదు
విశాఖపట్నం
అనంతపురం
తిరుపతి
గుంటూరు
వరంగల్లు
నవోదయ ప్రచురణలు
విజయవాడ
గుంటూరు

వైపు చూస్తూ అమితమైన ఉత్సాహంతో గణగణమని చెప్పుకు పోతున్నది.

"ఒహ్ , ఈ బర్డ్స్ వ్యూలో నుంచి ఈ కోట ఎంత బాగా కనిపిస్తున్న దండి! ఈ కనిపిస్తున్న మోతీమహల్లోనే ఉమెన్స్ కాలేజి. ఇది గరల్స్ హైస్కూలు. ఈ ప్రక్కనున్నది రవుండ్ మహల్. అందులో బి. ఇడి. కాలేజి. దాని కింద మోడల్ స్కూలుంది. ఆ మధ్యలో కనిపిస్తున్నది ఉమెన్స్ హాస్టల్. ఆ ప్రక్కది మా కాలేజి సైన్సు విభాగం. ఇవన్నీ మహారాజా సంస్థలే! ఇంత విశాలమైన ఈ కోటలో ఏ ఒక్కటీ ఇప్పటి రాజా పి. వి. జి. కి సొంతం కాకపోవడం ఆయన గొప్పతనం. ఇలా విద్య కోసం దానం చేయడం దేశ చరిత్రలోనే అరుదు.

"ఈ కోటకి బయట ఇటుప్రక్క చూశారా—ఇది మహారాజా సంగీత కళశాల. అల్లదిగో!ఆ దూరాన కనిపిస్తున్నది మహారాజా సంస్కృత పాటశాల, కళాశాల.ఇదిగో! ఇటువైపు మామహారాజా కళాశాల. దాని వెనుక మహారాజా హైస్కూలు. దాని ప్రక్కనే ఉంటుంది మాన్సాస్ ఐ. టి. ఐ. విభాగం. ఒక విధంగా చెప్పాలంటే మా విజయనగరం విద్యల నగరం ..."

తన వూరు గొప్పని ఏవో ఉన్నత శిఖరాల మీద ఎగరేస్తున్నట్లు పట్టలేని ఆనందంతో ముందుకు వంగి చెయ్యి చాపి అన్నీ చూపిస్తూ ఇంకా ఏవేవో అనేస్తున్నది సీత.

కృష్ణ వాటిని చూడటమూ లేదు. ఆమె చెప్పినవి వినటమూ లేదు. ఆమె ముఖాన్ని తీక్షణంగా పరీక్షిస్తూ చటుక్కున తన చూపుని ఆమె చాతీ మీద పోనిచ్చాడు. కళ్ళలో మగ కోరిక. ఏదీ జరగాలని అమితంగా కోరిక ఉంటే అదే ఎప్పుడూ దృష్టిలో ఉంటుంది. దానికోసమే అన్వేషణ చేయాలనిపిస్తుంది. మరొకటి ఆలోచించా అనిపించదు. అప్పటికి అదే లోకం.

ఇన్నాళ్ళూ తన ఇల్లు తెలియనివ్వకుండా ముప్పతిప్పలు పెట్టి ఇప్పుడు అవలీలగా ఈ మేడ ఎక్కి ఈ నిర్జన ప్రదేశంలో నిర్భయంగా నాతో సొంత మనిషికి ఎదురుగా ఉన్నట్లు మాట్లాడేస్తున్నది. ఇలా నాతో ఫ్రీగా తిరిగేస్తున్న దంటే నే నంటే తప్పకుండా చాలా ఇష్టమే. ఇందాక ఆ గార్డెన్‌లో ఈ విషయం సిగ్గుపడుతూ స్పష్టం చేసింది కూడా. ఇప్పుడు ఈ ఎత్తైన డాబా మీద ఎవరూ లేరు. బహుశా ఇక్కడికి ఎవరూ రారు. ఈ క్షణం పోతే మళ్ళీ తిరిగి రాదు. అనూహ్యంగా దొరికింది ఈ అవకాశం. ఇలా అనుకుంటూ ఆమె దగ్గరగా జరుగుతూ రమారమి ఆమెని తాకినంత సమీపమయాడు.

అటువైపు చూస్తూ ఒక త్రుటి కాలం కూడా విరామం లేకుండా గణగణమని చెప్పుకు పోతున్న ఆమె నోరు టక్కున ఆగిపోయింది. అతని శ్వాస ఆమె ముఖానికి వేడిగా తగులుతున్నది. ఆ మసక మసక చీకటిలో స్పష్టంగా అతని వైఖరిని గమనించింది. వెంటనే అతను తనను తాకక ముందే ఏదో చెప్పాలని నోరు తెరిచింది. కాని, చెప్పనివ్వకుండా ఆమెని కౌగలించేసుకొని గట్టిగా హత్తుకుపోయాడు. కామంతో కళ్ళు వేడెక్కి దాహంతో చూస్తున్నాయి. చేతులు ఎక్కడెక్కడో తడిమేస్తున్నాయి. మెరుపులా

తన శక్తి నంతా ఉపయోగించి అతని కౌగిలిని విడిపించుకొని కొంచెం దూరంగా జరిగి, అతని భుజాల్ని పట్టుకొని ఆపుతూ కళ్ళల్లోకి సూటిగా గురిచూస్తూ.

''ఇక్కడ వద్దు. మనం వేరే చోటికి పోదాం. చీకటి కూడా పడుతున్నది. ఇలా ఎవరైనా రావచ్చు. నన్ను ప్రేమిస్తున్నారు. నా మాట వినరా?'' అంది కొంటెగా నవ్వుతూ.

అతడిని ఆవహించిన మత్తు ఇంక వదలలేదు. మత్తుగా చూస్తున్నాడు. తనకు నెరవేరాలని ఉన్న కోరికను ఇప్పుడే చెప్పాలని, ఈ చోటు బావుందని అనాలనుకుంటున్నాడు.

అతని జవాబుకోసం ఆగకుండా ఆమె చకచకా మెట్లు దిగిపోయింది. తరవాత అతడు తను తొందర పడినందుకు చింతిస్తూ — ఇలా ప్రవర్తించడమే మేలయిందని, ఇప్పుడు ఇంకా దగ్గరవబోతామని, తన కోరికని ఇలా చెప్పకుండా ప్రవర్తించడమే తీయని అనుభూతిని లోలోన ముసిముసిగా మురిసిపోతూ మెట్లవైపు నడిచేడు.

ఇద్దరూ ఆ బిల్డింగును వదిలి ప్రక్క ప్రక్కన నడక సాగించారు మాట్లాడుకుంటూ చుట్టూ చీకటి. దీపాల దారి.

సీత మనసు మండిపోతున్నది. కాని బయటికి ఏమాత్రం కనబడ నివ్వడం లేదు. అంత పెద్ద ఎత్తు నుండి కోటని, చుట్టూరా పరిసరాల్ని చూడాలని మనసు పడి సరదాగా చూద్దామని అంత పైకి వెళ్దామన్నాను. మంచివాడని నమ్మి నందుకు ఇలా ప్రవర్తిస్తాడా? ఈ బిల్డింగుని చూద్దామని నాతో అన్నప్పటి నుంచి నన్ను ఇలా చేయాలనే ప్రీప్లాన్‌తో ఉన్నాడా? అప్పటికి నాలో ఆ ధైర్యం లేకపోతే నేనేమయ్యుండే దాన్ని? వీడికి ఈ కోరిక చాలా రోజుల నుంచి ఉన్నట్లుంది. ఇన్నాళ్ళూ కలిసినప్పుడు ఏదో చూచాయగా వీడి కోరిక తెలిసేది కాని ఇలా అవకాశం వస్తే పశువవుతా డనుకోలేదు. వీడిని పెళ్ళాడితే నాకు తప్పకుండా నామం పెడతాడు. వీడికి తగిన బుద్ధి చెప్పాలి. ఒక స్థిర నిశ్చయానికి వచ్చి ఎప్పటి లాగే నవ్వుతూ అతనికి వెలుగులు చిమ్ముతూ మాట్లాడుతూ నడుస్తున్నది.

ఇందాక అనూహ్యంగా జరిగిన దానికి ఆమె కొంచెమైనా బాధపడినట్లు గ్రహించలేకపోయాడు అతడు. ఆమెతో నడుస్తూ మాట్లాడుతూ ఆమె అందాన్నే గమనించసాగాడు. ఆమె వంపుసొంపు లన్నీ కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఛాతీమీది ఎత్తు పల్లాల నుండి కళ్ళను కదపా లనిపించడం లేదు. అదేలోకంగా ఉంది. మూడు లాంతర్లు దాటిపోయారు. అదంతా అతనికి కొత్త దారి. అయినా పట్టించుకోవడంలేదు. అసలు అదే కాదు — మధ్య మధ్యలో తాను మాట్లాడవలసి వచ్చినా రెండు మూడు సార్లు ఆమె అడిగిన పిదప సమాధానంగా ఏదో అనేయాలని అనేస్తున్నాడు తప్ప ఆమె లోకాన్నీ పట్టించుకోవడం లేదు. దీన్ని సీత గమనించింది. నలుగురు నడిచే రోడ్డు మీద నడుస్తున్నా సభ్యత ఎలా చూపాలో కూడా పట్టించుకోవడం లేదని గ్రహించింది.

ఆగింది.

మహారాణి హాస్పిటల్ జంక్షను.

ఇంకా ఆమె ఛాతీ మీదే ఉన్నాయి అతని చూపులు.

''మా ఇల్లు ఇక్కడే ఉంది. కాని అటువైపు వద్దు. ఇలా రండి ఇటు వెళ్దాం'' అంది చిలకలా కులుకుతూ గోముగా.

కృష్ణ వంకరలు తిరిగిపోసాగాడు ఆమె తన మీద చూపుతున్న ప్రేమకి. 'ఏమో?! ఇటువైపు ఎక్కడయినా స్పెషల్‌గా మా ఇద్దరికీ చోటుందేమో?! అందుకే ఇందాక అక్కడ వద్దు అన్నాది' వెన్నులోంచి వచ్చిన ఈ ఆలోచన మెదడులో పూరింది. అంతే. ఆమెని అనుసరించాడు.

ఇద్దరూ రోడ్డు ప్రక్కగా నడిచేరు.

ఎదురుగా చూపింది. కృష్ణ చూశాడు. అది సన్నని సందు. వీధి దీపాలు కాంతిలో మిల మిల మెరుస్తున్నది. ఇంచు మించు ప్రతి గుమ్మం దగ్గరా సుందరీ మణులు ధగధగమని మెరిసిపోతున్నారు.

''చూడండి—మీరు కృష్ణుడు. వాళ్ళంతా గోపికలు. నిజానికి మీకు కావలసింది వాళ్ళే అది మీపాలిట బృందావనం. మీరు వెళ్ళగానే వాళ్ళు మిమ్మల్ని ఆహ్వానిస్తారు. మీరు డబ్బు చల్లాలేగాని మీకు కావలసినంత మంది—వెళ్ళండి.'' తన కోపాన్ని అణచుకుంటూ నెమ్మదిగా అనాలనుకున్నా ఈ మాటల్ని గట్టిగానే అన్నది సీత. రోడ్డున పోయేవాళ్ళు చుట్టూ మూగసాగారు.

ఇంతవరకూ అనుకూలంగా ఉండి, ఈ ఒక్క క్షణంలో సీతలో సడన్‌గా వచ్చిన ఈమార్పుకి అవాక్కయి చూడసాగాడు కృష్ణ.

చుట్టూరా జనాన్ని చూసి ఆమెలో ఉద్రేకం పెల్లుబికి గంభీరంగా అపర కాళికలా కనబడుతున్నది. ఆపకుండా ఆవేశంతో సాధ్యమైనంత సౌమ్యంగా అనసాగింది.

''నేను వయసుకు చిన్న దాన్నయినా ఇప్పటి వరకు నేను చూసిన చాలామందిలో ఏ ముందో గ్రహించ గలిగాను. కావలసింది బూతు. జీవితానికి కావలసిన మిగతా వాటితోపాటు ఒక మనిషి నుంచి పరిమితంగా మాత్రమే తీసుకొన వలసినది బూతు. నీతో పరిచయమయినప్పటి నుండి చూస్తున్నాను. అంతర్గతంగా ఏమూలో ఉండవలసిన కామం నీకళ్ళలో ఎప్పుడూ కదలాడు తున్నది. ఇందాక నీ చేతలలో నీ కామ కోరిక పూర్తిగా బయట పడింది. ఆడయినా, మగయినా సన్నిహితంగా చేయి చేయి కలిపినడిస్తేనే ఈ సమాజమూ సవ్యమార్గాన నడుస్తుంది. ప్రక్కనున్నది ఆడది అవగానే వెంటనే ఆమెనుండి కావలసిన బూతునే గ్రహించకూడదు. మనిషి అవసరాల్లో ఒక భాగమయిన కామం నెరవేరడానికి నియమ నింబంధనలు ఏర్పరచ బడ్డాయని నీకూ తెలుసు. ఎక్కడ పడితే అక్కడ అసహ్యంగా ప్రవర్తించమని ఎవరూ చెప్పలేదు. అందుకే దాన్ని పెళ్ళితో ముడిపెట్టారు. అయినా నీలాటి వాడితో తిరగడం నాబుద్ధి తక్కువ. కలుపు గోలుగా తిరగడం వల్ల సామాజిక జ్ఞానం పెరుగుతుందని, ఒకప్పుడు కాకపోయినా ఒకప్పుడయినా ప్రతి మనిషి అవసరమూ కలుగుతుందని, అందులోన్నూ పరిచయమున్న మనిషయితే సహాయం తప్పకుండా లభిస్తుందని నా అలవాటు ప్రకారం నీతో పరిచయం పెంచుకున్నాను. అంతే. అవకాశం దొరికిన ఆడదాన్ని అనుభవించాలని


వాణిజ్య ప్రకటనలకు
ఆంధ్రప్రభ
ఉత్తమ సాధనం

దీర్ఘ వ్యాధులకు ఉత్తమసిద్ధవైద్యం!

నరముల బలహీనత
ధాతుపుష్టి. యవ్వనశక్తి
హెర్నియా బుడ్డవ్యాధులకు
పోస్ట్ ద్వారా కూడా కలదు
వరిబీజం (బుడ్డ)
మూత్రవ్యాధులకు
ఆపరేషన్ లేకుండా-రండి
డా॥దేవర, ఫోన్: 551, మార్కాజీపుజివన్న, తెనాలి.
బ్రాంచి: 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాసు—17

ఉచితము! ఉచితము!!
తెల్లమచ్చలు
అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మార్చును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచారము నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయుండు. వివరాలకు:
BHARAT AYURVEDASHRAM
P.O. Katri Sarai (Gaya)



